

## సాలూరు మునిసిపల్ కమిషనర్ సరెండర్

సాలూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సాలూరు మునిసిపల్ కమిషనర్ సీహెచ్ సత్యనారాయణను సరెండర్ చేస్తూ కలెక్టర్ శామ్‌ప్రసాద్ గురువారం రాత్రి ఆదేశాలు జారీచేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కమిషనర్‌పై కలెక్టర్ చర్యలు తీసుకోవడంతో ఒక్కసారిగా కలకలం నెలకొంది. ఈ మేరకు ఇన్‌చార్జి కమిషనర్‌గా డీఈ ప్రసాద రావును నియమిస్తూ కలెక్టర్ ఉత్తరులు జారీచేశారు.

# ఈ దుమ్ము, ధూళి భరించలేం



బుధవారం రాత్రి వాహనాలను అడ్డుకుని నిరసన తెలుపుతున్న మహిళలు

- శబ్ద కాలుష్యంతో అల్లాడుతున్నాము
- రోగాలొస్తే వేలాది రూపాయల ఖర్చు
- తొమ్మిది గ్రామాలకు తీవ్ర అసౌకర్యం
- పెదగుడబలో క్వారీ లారీల అడ్డగింత
- రెండు రోజులుగా ప్రజల ఆందోళనలు
- తమగోడు పట్టించుకోవడంలేదని ఆవేదన
- పోలీసుల రంగప్రవేశంతో ఉద్రిక్తత
- 15మంది గ్రామస్థులపై కేసుల నమోదు



తమకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ కాళ్లు మొక్కుతున్న మహిళలు



గురువారం ఆందోళన చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పార్వతీపురం/ గరుగుబిల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 'ఈ క్వారీ లారీల వల్ల దుమ్ము, ధూళి భరించలేక పోతున్నాము. శబ్దకాలుష్యంతో నిద్రే పట్టడం లేదు. చాలామందికి జబ్బులొస్తున్నాయి. వేలాది రూపాయలు ఖర్చవుతోంది. వెంటనే వీటిని ఆపించండి' అంటూ గరుగుబిల్లి మండలం పెద్దగుడబ గ్రామస్థులు వాపోతున్నారు. తమ గ్రామం మీదుగా వెళ్తున్న లారీలను అడ్డుకున్నారు. వాహనాల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. వారి వివరాల మేరకు.. చిన్నగుడబ రెవెన్యూ పరిధిలో అత్యం మైనింగ్ క్వారీకి 2006లో దరఖాస్తు చేసుకోగా 2007లో అనుమతులు మంజూరయ్యాయి. అయితే సమీప గ్రామాల ప్రజల ఇబ్బందులను గనులశాఖ అధికారులు, రెవెన్యూశాఖ అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్వారీ నుంచి ప్రతిరోజూ లారీల్లో కంకరను భారీ వాహనాల్లో పరిసర గ్రామాల మీదుగా తరలిస్తున్నారు. దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ బుధ, గురువారాల్లో పెదగుడబ గ్రామస్థులు అడ్డుకున్నారు. రాకపోకలకు అంతరాయం కలిగించారు. గ్రామానికి ఆనుకుని ఉన్న క్వారీ నుంచి శబ్ద కాలుష్యంతో పాటు దుమ్ము, ధూళి రేగడంతో పలు సమస్యలతో సతమతమవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. క్వారీ నుంచి సామగ్రిని నిత్యం భారీ వాహనాలతో తరలించడంతో పెదగుడబ, వల్లరిగుడబ, చినగుడబ, గదబవలస, సన్యాసిరాజుపేట, బాలగుడబ, కొంకడివరం, దళాయివలస, శివరాంపురం గ్రామస్థులకు తీవ్ర అసౌకర్యం నెలకొందన్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులకు తెలియపర్చినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాత్రి పూట నిద్ర పట్టని పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. రాత్రే కొంతమందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గురువారం రోడ్డుకు అడ్డుగా ఉన్న వారిని పక్కకు తోసేశారు.

### మా ప్రాణాలు కాపాడండి సారూ

'మా ప్రాణాలు కాపాడండి, అరెస్టులను ఆపండి' అంటూ మహిళలు గురువారం పార్వతీపురం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సమావేశం ముగించుకుని వచ్చిన సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ కాళ్లపై పడ్డారు. తమ వారిని అరెస్టు చేశారని, వారిని విడుదల చేయాలని వేడుకున్నారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

### క్వారీ యాజమాన్యం ఫిర్యాదు

తమ లారీలను ప్రజలు అడ్డుకోవడంతో క్వారీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్వారీ సామగ్రి తరలించేందుకు యాజమాన్యానికి అవసరమైన అనుమతులు ఉన్నాయని, అడ్డుకోవడం తగదని హెచ్చరించారు. యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు 15 మందిపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. అయితే న్యాయబద్ధమైన సమస్యపై పోరాటం చేస్తున్న తమపై అక్రమ కేసులు బనాయించారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### నిబంధనల మేరకే తవ్వకాలు

అత్యం మైనింగ్ క్వారీలో తవ్వకాలకు సంబంధించి అన్ని అనుమతులు ఉన్నాయి. నిబంధన ప్రకారం తవ్వకాలు జరుగుతున్నాయి. బ్లాస్టింగ్‌కు సంబంధించి మా శాఖ పరిధిలో లేదు. పోలీస్‌శాఖ పరిధిలో ఉంటుంది. ఇటీవల వివిధ శాఖల ద్వారా జాయింట్ దర్యాప్తు పూర్తి చేసి నివేదిక అందించాం.

**- శ్రీనివాస్, జిల్లా గనులశాఖ అధికారి**

### రాజకీయ కక్షతోనే అడ్డుకుంటున్నారు

చినగుడబ ప్రాంతంలో గత 16 ఏళ్లుగా క్వారీ నిర్వహిస్తున్నామని క్వారీ ప్రతినిధి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. అయినా

(మిగతా 6వ పేజీలో..)



కందకాల పనులను అడ్డుకున్న సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

## జనావాసాల మధ్య ఏనుగుల జోన్ వద్దు

- అధికారులు కందకాల తవ్వకం ఆపాలి
- ప్రజా సంఘాల డిమాండ్

సీతానగరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అప్పయ్యపేట, రేపటివలస సరిహద్దుల్లో ఏనుగుల జోన్ పేరుతో ఫారెస్టు అధికారులు చేపట్టిన కందకాల తవ్వకాల పనులను నిలుపుదల చేయాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అక్కడ వారు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ జిల్లా నడిబొడ్డున ఉన్న సీతానగరం మండలంలో ఏనుగుల జోన్ పెట్టడం తగదన్నారు. ఈ ప్రాంతంలో కందకాల తవ్వకం వల్ల గిరిజనలు, దళితులు, పేదలు గత 50 ఏళ్ల నుంచి పెంచుకున్న తోటలు నాశనం అవుతున్నాయన్నారు. కొందరికి పోడు పట్టాలు, లీజు పట్టాలు ఉన్నా ఫారెస్టు అధికారులు వాటిలో తవ్వకాలు చేస్తున్నారని ఆరోపించారు. జనావాసాల మధ్య ఏనుగుల మధ్య ఏనుగుల జోన్ ఏర్పాటు చేస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని, ఇప్పటికే కురుపాం, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల్లో ప్రజలను తొక్కేస్తూ పంటలను నాశనం చేస్తున్నాయని అన్నారు. ఏనుగులు ఎక్కడ నుంచి వచ్చాయో అక్కడికే పంపించాలని డిమాండ్ చేశారు. ఫారెస్టు అధికారుల నిర్వాకంతో అప్పయ్యపేట, రేపటివలస, తామరకండి, పులిగుమ్మి, గుచ్చిమి, సీతారాంపురం, జోగింపేట గ్రామాల ప్రజలు ఆందోళనతో ఉన్నారన్నారు. అధికారులు తక్షణమే పనులు నిలుపుదల చేయాలని, లేకుంటే ఈ కొండ చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలతో పోరాటం ఉధృతం చేస్తాని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డి వేణు, మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, ఆర్.రాము, వై.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## హోలీ.. రంగుల కేళీ

- అప్రమత్తతే శ్రీరామరక్ష
- రసాయనాలతో ప్రమాదం
- ప్రకృతిసిద్ధ రంగులే శ్రేయస్కరం



హోలీ పండగ... ఐక్యతను చాటే పర్వదినం ఇది. ఒకరికొకరు రంగులు చల్లుకోవడం.. శుభకాంక్షలు తెలుపుకోవడం పరిపాటి. అయితే ఈ పండగను సంతోషంగా జరుపుకోవాలంటే రసాయన రంగుల జోలికి వెళ్లవద్దని వైద్యులు సూచిస్తున్నారు. వీటివల్ల కళ్లకు హానిజరిగే ప్రమాదం ఉందని, శ్వాసకోశ వ్యాధులు కూడా రావచ్చని చెబుతున్నారు. దీంతో ప్రకృతి సిద్ధమైన కూరగాయలు, ఆకులు, పువ్వులతో తయారు చేసిన రంగులు వినియోగించాలని, దీనివల్ల పర్యావరణానికి కూడా మేలు చేసిన వారమవుతామని అంటున్నారు.

7లో

### జిల్లాలో మూడు శక్తి బృందాలు

- ఎస్పీ మాధవరెడ్డి



పార్వతీపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుటున్నామని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 'జిల్లాలో మూడు శక్తి బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. జిల్లా కేంద్రంలో ఒకటి, పాలకొండలో ఒకటి, సాలూరులో ఒకటి ఉంటాయి. వీటికి వాహనాలు కూడా సిద్ధం అయ్యాయి. డ్రాప్ బాక్సులను ఇప్పటికే ఏర్పాటు చేశాము. శక్తి బృందంలో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది ఉంటారు. జిల్లాలో శుక్రవారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుంది' అని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

## రేపు ప్రతిగ్రామంలోనూ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర

- యాప్‌లో కార్యక్రమం వివరాల నమోదు
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలు

పార్వతీపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 15వ తేదీన ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో కార్యక్రమాల వివరాలను నమోదు చేయాలని తహసీల్దార్లకు సూచించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో గురువారం సబ్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రీసర్వే పక్కాగా జరగాలని, దీన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్మిస్తున్న

(మిగతా 6వ పేజీలో..)

**పర్యవేక్షణ లేక.. చెత్త పేరుకుపోయి**

- బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్న సంకావీధి వాసులు

6లో

## జంఝావతి సామగ్రి దొంగలపాలు

- ఇనుపకడ్డీలు, రేకులు ఎత్తుకెళ్తున్న దుండగులు



సిబ్బంది నివాస గృహాలు ఇలా..

కొమరాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జంఝావతి నదిపై నిర్మించిన వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు జలాశయ (జంఝావతి ప్రాజెక్టు) పథకంలో విలువైన పరికరాలు, వస్తువులు దొంగల పాలవుతున్నాయి. 1973లో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టా రు. అప్పట్లో పనిచేసే సి బ్బంది కోసం నివాస గృహాలను సమీపం లోనే నిర్మించారు. ప్రస్తుతం అవి శిథిలమయ్యాయి. గృహాల నిర్మాణానికి వినియోగిం చిన రాయి, ఇనుప కడ్డీలు, రేకులు తదితర వస్తువులను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి లక్ష లాది రూపాయలు గండి పడుతోంది. అధి కార యంత్రాంగం స్పందించి అక్రమంగా తరలిం చుకుపోతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. జంఝావతి ప్రాజెక్టు ఏఈ అభిషేక్ వద్ద ప్రస్తావించగా సిబ్బంది కొరత వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రాజెక్టులో పనిచేసే వాచ్‌మన్లు పదవీ విరమణ చేయడంతో కాపలా లేక దుండగు సామగ్రి పట్టుకుపోతున్నారన్నారు. కొమరాడ తహసీల్దార్‌కు ఈ నెల 5న ఫిర్యాదు చేశామని ఏఈ తెలిపారు.

- శిథిలావస్థలో తురకనాయుడువలస వంతెన
- బిక్కుబిక్కుమంటూ రాకపోకలు
- భయాందోళనలో రెండు మండలాల ప్రజలు



## కూలితే.. అంతే!

పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న వంతెన



పెచ్చులూడిన వంతెన స్లాబు

జియ్యమ్మవలస, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఇది తురకనాయుడువలసలో పురాతన వంతెన దుస్థితి. మండల కేంద్రం నుంచి 25 గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇదే షార్ట్ కట్ రహదారి. కీలకమైన ఈ మార్గంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. వాస్తవంగా 1902లో బ్రిటీష్ హయాంలో దీనిని నిర్మించారు. ప్రస్తుతం ఇది పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. వంతెన పిల్లర్లు, శ్లాబు గజాలు బయటకు కనిపిస్తున్నాయి. రక్షణ గోడ కూడా లేదు. దీనిపై నుంచే రోజూ పెదబుడ్డిడి, ఇటిక - నాగూరు బస్సులు, ప్రైవేట్ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెన ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో గరుగుబిల్లి- జియ్యమ్మవలస మండలాల ప్రజలు తీవ్ర

(మిగతా 6వ పేజీలో..)

## పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ కోరారు. పార్వతీపురం మండలం రావికోన గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన బుధవార రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టంగా చదవాలని, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని కోరారు. పరీక్షలకు వెళ్లే విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికావద్దని హితవు పలికారు. ఉన్నతమైన స్థానానికి చేరాలంటే పదో తరగతి పునాది అని గుర్తు చేశారు.

## హోంమంత్రితో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ



అనితతో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు

గుమ్మలక్ష్మీపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోంమంత్రి వంగలపూడి అనితను మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకటరావు, తోయక జగదీశ్వరి, విజయచంద్ర, బేబినాయన తదితరులు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ బేటీలో ఆయా నియోజకవర్గాల్లో శాంతిభద్రతలతోపాటు పలు అంశాలపై చర్చించారు.

## జేజేఎం నిధుల మంజూరు: ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం/కొమరాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గంలోని 137 గ్రామాలకు జలజీవన్‌మిషన్ (జేజేఎం) ద్వారా తాగునీరు అందించేందుకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. కొమరాడ, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, గరుగుబిల్లి మండలాల్లోని 137 హేబిటేషన్లలో రూ.1663.80 లక్షలతో ఇంటింటికి తాగునీరు అందజేసేందుకు త్వరలో టెండర్లు పిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

గరుగుబిల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకురావాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ నల్ల తిరుపతినాయుడు కోరారు. గురువారం గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బీల పద్మావతి, సత్యనారాయణ ఫౌండేషన్ నిర్మించిన సైకిల్ షెడ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ పాత్రుడు, ఎంఈవోలు దత్తి అప్పలనాయుడు, కె.కొండలరావు, కె.రవీంద్ర పాల్గొన్నారు.

**పదో తరగతిలో ప్రతిభ కనబరచాలి**

పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి ప్రథమ స్థానాల్లో నిలవాలని జిల్లా విద్యాశాఖాధికారి నల్ల తిరుపతినాయుడు సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలానికి చెందిన తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామగ్రిని అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు దత్తి అప్పలనాయుడు, కె.కొండలరావు, ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ పాత్రుడు, కె.రవీంద్ర పాల్గొన్నారు.

## పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు: డీడీ

సీతంపేట రూరల్,మార్చి 13(ఆంధ్రజ్యోతి):పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గిరిజనసంక్షేమశాఖ డీడీ అన్నదొర చెప్పారు.గురువారం సీతంపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో ఈఏడాది 1791మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. విద్యార్థులకు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కిట్‌లను అందజేసినట్లు చెప్పారు. సీసీ కెమెరాల నిఘాల్లో పరీక్షలు జరుగుతాయని,మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## గిరిజన రైతులను ఆదుకోండి

కొమరాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అగ్నికి ఆహుతైన జీడి మామిడి తోటల రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈమేరకు గురువారం బాధిత రైతులతో కలిసి పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవను కలిసి వినతిపత్రం అందజేశారు.

## మొల్లకు ఘన నివాళి

పార్వతీపురంటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో చంద్రమౌళీశ్వర శాలివాహన సేవా సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతి గురువారం నిర్వహించారు. కుమ్మరివీధి కూడలిలో గల మొల్ల విగ్రహానికి మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్, టీడీపీనాయకుడు బెలగాం జయప్రకాష్ నారాయణ, సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో సంఘ సభ్యులతో పాటు 24వ వార్డు కౌన్సిలర్ ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

## భద్రగిరి ఆసుపత్రి పరిశీలన

గుమ్మలక్ష్మీపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):భద్రగిరి ఆసుపత్రిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విష జ్వరాలు అరికట్టడానికి తీసుకుంటున్న చర్యల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజన గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సాల్మన్‌రాజ్‌కు విన్నవించారు. కార్యక్రమంలో పాడి సుదర్శనరావు, బిడ్డిక పద్మావతి పాల్గొన్నారు.

## నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

పాలకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేసవిలోనీటి కోసం ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని నగర పంచాయతీ తాత్కాలిక చైర్మన్ పల్లా ప్రతాప్‌రావు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం పట్టణంలో పలుప్రాంతాలకు కుళాయిల ద్వారా తాగునీరు అందకపోవడంతో ఐదోవార్డు కౌన్సిలర్ వెలమల మన్మథరావు ఆధ్వర్యంలో తాగునీటి పైపులైన్లు, కుళాయిలకు మరమ్మతులు నిర్వహించారు.

## కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

పాలకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై జంతుశాస్త్ర విభాగం, ఐక్యూఏసీ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ మెరైన్ లివింగ్ రిసోర్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ సి.మమత, ప్రిన్సిపాల్ శ్యాంబాబు కెరీర్ గైడెన్స్ కోసం వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు ఎం.శాంతి పాల్గొన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి):ల్యాబ్‌టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవచూపాలని ఏపీఎన్‌జీవో సంఘ నాయకులు బీవీఆర్ ఎస్ కిషోర్, జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అధ్యక్షుడు వై.తిరుపతిరావు కోరారు. గురువారం పార్వతీపురంలోని ఎన్‌జీవో హోంలో నిర్వహించినల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవంలో మాట్లాడుతూ ల్యాబ్‌టెక్నీషియన్లకు పదోన్నతి కల్పించాలని కోరారు.

## యువతను మోసగించిన జగన్

గరుగుబిల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో యువత గుర్తుకు రాలేదా అని కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు ప్రశ్నించారు. గురువారం నాగూరులో విలేఖరులతో మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి యువతను మోసగించారని ఆరోపించారు. యువతను ఆదుకుంటామని హామీలుఇచ్చి తుంగలో నెట్టారని విమర్శించారు.

## ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భామిని, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్ భామినిలో 2025-26 విద్యాసంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్‌ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. మే 22 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## పారా అథ్లెటిక్స్‌లో బంగారు పతకం

గుమ్మలక్ష్మీపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలంకకు చెందిన విద్యార్థిని కోలక లలిత ఢిల్లీలో జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో సత్తా చాటింది. ఈ మేరకు పరుగు పందెంలో బంగారు పతకం సాధించింది.

## ఎంఈవో-2గా వెంకటరావు

సాలూరు రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సాలూరు ఎంఈవో-2గా మామిడిపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం నల్ల వెంకటరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంఈవో-2గా పి.దాసు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఈ ఏడాది జనవరి 31న పదవీవిరమణ చేశారు.

## సీతానగరంలో రక్తదాన శిబిరం

సీతానగరం,మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా 11 మంది రక్తదానం చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఉషారాణి,రాధాకాంత్, పావని,రాజు పాల్గొన్నారు.

# పర్యవేక్షణ లేక.. చెత్త పేరుకుపోయి

- విషసర్పాలు, దోమల స్వైరవిహారం
- బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్న వైనం
- ఇదీ పార్వతీపురం మునిసిపాలిటీలో గల సంకా వీధిలో పరిస్థితి



సంకావీధి మధ్యలో పేరుకుపోయిన చెత్త

పార్వతీపురంటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మునిసిపాలిటీ పరిధిలో గల 24వ వార్డులోని సంకావీధిలో సమస్యలు తిష్టవేశాయి. ప్రధానంగా మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అడుగడుగునా చెత్త పేరుకుపోయింది.ప్రధానంగా పగటి పూట విషసర్పాలు, చీకటిపడితే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, దీంతో బిక్కుబిక్కుమని కాలం గడపాల్సివస్తోందని స్థానికులు వాపోతున్నారు. వీధి మధ్యలో చెత్త, వ్యర్థాలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వల్ల అవస్థలకు గురవుతున్నారు. వీధిలోని పరిస్థితిని ఏడాది నుంచి మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదని సంకావీధికి చెందిన ఆకుల శ్రీనివాసరావు, బోటు మల్లేశ్వరరావు, సంకా ఆనందరావు, సంకా గోపి, గెంబలి సత్యనారాయణ తదితరులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించకపోతే మునిసిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపడతామని పలువురు హెచ్చరించారు. కాగా సంకావీధిలో సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని మునిసిపల్ ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్ పకీరు రాజు తెలిపారు.

## డ్రోన్లతో సారా తయారీపై నిఘా

- దత్తత అధికారుల నియామకం
- కలెక్టర్ శ్యాం ప్రసాద్

పార్వతీపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి):డ్రోన్లను ఉపయోగించి సారా తయారీ క్రేందాల సమాచారాన్ని సేకరించి, పటిష్ట నిఘా ఉంచాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కోరారు. నవోదయం 2.0 కింద సారా రహిత జిల్లాగా పార్వతీపురాన్ని తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నవోదయం 2.0 కార్యక్రమంపై జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. నవోదయం 2.0 ప్రచార రథం ప్రారంభించారు. కరపత్రాలు, గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 137 గ్రా మాలను ఏబీసీ గ్రామాలుగా వర్గీకరించి దత్తత అధికారులను నియమించినట్లు తెలిపారు. సారా సంబంధిత ఫిర్యాదులకోసం టోల్ ఫ్రీ నెంబర్ 14405పై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. 1265 మంది పాత నేర చరిత్ర గల వ్యక్తులను గురించి వారిలో 191 మందిని బైండోవర్ చేసిన విషయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో 2.0 ప్రచార వాహనానికి జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. సమావేశంలో ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, ఏఎస్పీ అంకిత సురాన, అసిస్టెంట్‌కమిషనర్ రామచంద్రరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, డీఈవో ఎన్.తిరుపతినాయుడు పాల్గొన్నారు.

**మొల్ల రచనలు ఆదర్శం**

కవియిత్రి మెల్లమాంబ రచనలు అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పార్వతీపురంలో మొల్ల జయంతి వేడుకలు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్ల చిత్రపటానికి పూలమాలలను వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, ధర్మచంద్రారెడి పాల్గొన్నారు.

**అందరికీ వివేకానంద ఆదర్శం**

పార్వతీపురంటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద అందరికీ ఆదర్శప్రాయుడని మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం పార్వతీపురం జిల్లా పరిషత్ సంస్కృత ఉన్నత పాఠశాల ఆవరణలో వివేకానందుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం హేమసుందరరావు, తిరుమలాచార్యులు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, గోవిందరావు, డీఈవో తిరుపతిరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీరాములు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌సుందర్

**దృష్టి లోపాలను సరిచేసుకోవాలి**

ప్రతి ఒక్కరూ దృష్టి లోపాల పరీక్షలను నిర్వహించుకొని, సరిచేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. పార్వతీపురంలో ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికిపైగా పరీక్షలు చేయగా 80 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు.

## ఈ దుమ్ము, ధూళి భరించలేం

(ఐదో పేజీ తరువాయి)

వాహనాలను బయటకు వెళ్లకుండా తీవ్ర ఆటంకాలు కలిగిస్తున్నారన్నారు. క్వారీని ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్వారీ నిర్వహణపై పలు ఫిర్యాదు చేశారని, అవసరమైన పత్రాలను ఉన్నతాధికారులకు తాము అందించామని చెప్పారు. రాజకీయ కక్షతోనే వాహనాలను అడ్డుకుంటున్నారన్నారు.

**41 నోటీసులు అందించాం**

రోడ్డుకు అడ్డంగా ఉండి రవాణాకు ఆటంకం కలిగిస్తున్న వారిపై కేసు నమోదు చేశాము. వారికి 41 నోటీసులు అందించాము. ఎవరినీ అరెస్టు చేయలేదు. ప్రజా రవాణాకు ఆటంకం కలిగించడంతో చట్ట ప్రకారం కొంతమందిని అదుపులోకి తీసుకున్నా.. తిరిగి వారిని విడిచిపెట్టాము.

- తిరుపతిరావు, చినమేరంగి ఎస్‌ఐ

## కూలితే.. అంతే!

(ఐదో పేజీ తరువాయి)

భయాందోళన చెందుతున్నారు. ఇంకో విషయం ఏమిటంటే ఈ వంతెనకు సమీపంలోనే తోటపల్లి ఎడమ కాలువ డిస్ట్రిబ్యూటరీ ఉంది. దీంతో ప్రాజెక్టు ఆధునికీకరణలో భాగంగా ఈ వంతెన పనులు చేపట్టేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిపై దృష్టిసారించ లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్పందించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

## రేపు ప్రతిగ్రామంలోనూ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర

(ఐదో పేజీ తరువాయి)

గృహనిర్మాణాల్లో పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పీఎంఏవై 1.0 కింద ఇళ్ల మంజూరై వివిధ దశల్లో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సాయం అందిస్తుందన్న విషయం లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఆ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే గ్రామసభలో వచ్చిన విజ్ఞప్తులపై మండల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మ్యుటేషన్, అడంగల్ వంటి సమస్యలపై తదితర వాటిపై తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కేఆర్ఆర్ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు

**23 నాటికి సర్వే పూర్తి చేయాలి**

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల సర్వేని మార్చి 23వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. వివిధ శాఖల ప్రగతిని కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 20వ తేదీ నాటికి మొదటి దశ పూర్తి చేస్తే 21వ తేదీ నాటికి వారిఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సమావేశంలో కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## తోటపల్లి నుంచి నీరు విడుదల చేయాలి

పాలకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి నుంచి నీరు తక్షణమే విడుదల చేయకపోతే ఈ నెల 17న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. గురువారం పట్టణంలోని జలవనరులశాఖ ప్రాంతీయ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నీటి సంఘం నాయకులు రామకృష్ణ, పామోటి వైకుంఠరావు, దుప్పాడ గౌరునాయుడు, దుప్పాడ చిన్నమనాయుడు, ప్రభాకరరావు, ఆర్.ప్రభాకరరావు, కోట విశ్వేశ్వరరావు, కిమిడి రామ్మూర్తినాయుడు, సంగంనాయుడు, ఉదయాన చిన్నమనాయుడు, బి.శివకుమార్ పాల్గొన్నారు.

## వేలంపాటల ఖరారు

పాలకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని రోజువారి మార్కెట్, వారపు సంత, పశువుల సంత, జంతువధశాల, కారు, బస్టాండ్, చెట్లు ఫలసాయం కోసం వేలంపాట ఖరారుచేశారు. గురువారం నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ మేరకు రూ.13,57,000 పాటను కటకం దుర్గారావు దక్కించుకున్నారు.

## సమ్మె విరమించి.. విధుల్లో చేరండి: కమిషనర్

సాలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 'మనమంతా ఓ కుటుంబం. ఇక్కడ ఎవ్వరూ ఇబ్బందులు పడకూడదు. మీకు రెండు నెలలు జీతం బకాయి ఉంది. ఇప్పుడు మీకు తక్షణం ఓ నెల జీతం మీమీ ఖాతాల్లో జమచేస్తాను. తర్వాత మళ్లీ మరో నెల జీతం జమ చేస్తాను.సమ్మె విరమించి తక్షణం విధుల్లో చేరండి' అని మునిసిపల్ కమిషనర్ సీహెచ్ సత్యనారాయణ కోరారు. మునిసిపల్ కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య కార్మికులు నాలుగు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం కార్మికులతో కమిషనర్ మాట్లాడు తూ మనమంతా ఓ కుటుంబం అని, మీసమస్య మనందరి సమస్య అని తెలిపారు.

## నేడు పాచిపెంటలో డోలా యాత్ర

పాచిపెంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీత్రినాథస్వామి ఆలయం వద్ద శుక్రవారం హోళి పురస్కరించుకుని డోలా యాత్ర నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు తెలిపారు. గురువారం బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో కూడిన విగ్రహాలను పల్లకిలో తిరువీధుల్లో ఊరేగించారు. పాచిపెంటలో గల త్రినాథాలయంలో విష్ణు, మహేశ్వరులతోపాటు బ్రహ్మను పూజిస్తారు.

## పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయండి

కురుపాం,మార్చి13(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు ఆదేశించారు. గురువారం కురుపాంలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఎంఎల్ఎస్ పాయింట్, డీఆర్ డిపో, మొబైల్ వాహనం ద్వారా నిత్యవసర వస్తువులు పంపిణీ పరిశీలించారు. తొలుత శివ్వన్నపేట డిపోలో తూనికలు కొలతలు అధికారి రత్నరాజుతో తనిఖీ చేయించారు. ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీలో స్టాక్ పరిశీలించారు. నిత్యవసర వస్తువలు వాహనం తనిఖీ చేసి సీల్ వేయించాలని అదేశించారు. అలాగే మంతినివీధి, గౌడువీధి, మంతినవలసలో అంగన్‌వాడీ కేంద్రాల స్టాక్ పరిశీలించి, వంటకాలను ఆహార భద్రతాధికారి వై.రామయ్యతో తనిఖీ చేయించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. స్టాక్ రూములో స్టాక్ తక్కువగా ఉండంతో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● సీతానగరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగింపేట కేజీబీవీలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు స్టాక్ రిజిస్టర్లు, ఆహారనాణ్యత పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో సూరిదేముడు, సమగ్ర శిక్ష జీసీడీవో మధుకిశోర్, ప్రిన్సిపాల్ జొన్నాడ సంధ్య ఉన్నారు.

## మినీ గోశాలల నిర్మాణం వేగవంతం చేయాలి

మక్కువ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మినీ గోశాలల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో డీడీ స్వరూపారాణి కోరారు. తూరుమామిడిలో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న మినీ గోశాలల నిర్మాణాలను గురువారం పరిశీలించారు. కార్య క్రమంలో ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు వాహనాల సీజ్.. 15 పశువులు స్వాధీనం

పార్వతీపురం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సిపురం పంచాయతీ పరిధిలో 15 పశువులతో వెళ్తున్న రెండు వాహనాలను రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమారి ఆధ్వర్యంలో పోలీసులు దాడులుచేసి అడ్డుకున్నారు. ఈ మేరకు రెండు వాహనాలు సీజ్‌చేసి 15 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భామిని, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురండి సబ్‌స్టేషన్ పరిధిలో గల వడ్డంగి, లోహరజోల, సింగిడి, బిల్లుమడ, నులకజోడు తదితర గ్రామాల్లోశుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జంగిల్ క్లియరెన్స్ మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు.

● జియ్యమ్మవలస, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం కుదమ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శంకరరావు తెలిపారు. సబ్‌స్టేషన్ కంట్రోల్‌లో 11 కేవీ ఫీడర్‌లో సింగనాపురం సమీపంలో చెట్టు కొమ్మలు నరకడం, ఆర్‌డీఎస్ఎస్ పోల్ ఎరిక్షన్ వర్క్ చేయనుండడంతో చినకుదమ, పెద కుదమ, గౌరీపురం, గెడ్డతిరువాడ, టీఎన్ వలస, సింగనాపురం గ్రామాలకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు 2 గంటల వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

## రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):అర్హత ఉన్న బీసీ లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎం.విజయా రంగారావు తెలిపారు. 18 నుంచి 50 సంవత్సరాల్లోపు గల వారు 22లోగా మీసేవ కేంద్రాలు, సచివాలయంలో గాని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

బెలగాం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఎస్సీ ఎస్టీ మాధవరెడ్డి గురువారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల చుట్టూ ఉన్న పరిసరాలను, తీసుకున్న భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు.

## అమ్మకు 'అమృత ఆహారం'

పాచిపెంట, మార్చి13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 83 మంది రక్తహీనత గల గర్భిణులకు అమ్మకు అమృత ఆహారం కిట్లను పంపిణీ చేసినట్లు సీడీపీవో బొత్స అనంతలక్ష్మి తెలిపారు. ఈ మేరకు గురువారం పాచిపెంటలో పలువురు గర్భిణులకు కిట్లు అందజేశారు.



## సారా రహిత గ్రామాలే ధ్యేయం

- ప్రజలంతా భాగస్వాములు కావాలి
- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు



మాట్లాడుతున్న రామచంద్రరావు

జియ్యమ్మవలస, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయమని, ఇందుకోసం ప్రజలు సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు పిలుపునిచ్చారు.గురువారం చినమేరంగి దళితవాడలో నవోదయం 2.0 కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తయారీ, రవాణా, అమ్మకాల వల్ల అనర్థాలు, విధిస్తున్న శిక్షలను వివరించారు. అనంతరం గ్రామస్థులతో నవోదయం 2.0 ప్రతిజ్ఞ చేయించారు. కార్య క్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు, ఏఈఎస్ పి.జీవన్‌కిశోర్, ఎస్ఐ జె.రాజశేఖర్, సర్పంచ్ అల్లు రవణమ్మ పాల్గొన్నారు.

# రెడ్డికంచేరులో పోలీస్ అవుట్‌పోస్ట్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ

● ప్రజల సౌకర్యార్థమే: ఎస్పీ వకుల్ జిందాల్

భోగాపురం, మార్చి13(ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం మండలంలోని రెడ్డికంచేరులో పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. స్థానికులకు ఎయిర్ పోర్టు నిర్మాణంలో భాగంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వర్కర్స్ మధ్య విబేదాలు తలెత్తకుండా ఉండేందుకు దీన్ని ఏర్పాటు చేశామన్నారు. గురువారం ఆయన పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నిర్మాణం నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వర్కర్స్ వచ్చి పనులు చేస్తున్నారన్నారు. ఎయిర్‌పోర్టు వర్కర్స్ స్థానికుల మధ్య తరచూ ఘర్షణలు, వాగ్వాదాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీస్ బీట్, పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు. అయితే పోలీస్ సేవలు మరింత విస్తృతం చేయాలనే ఉద్దేశంతో జీఎంఆర్, ఎల్అండ్‌టీ సహకారంతో పెట్రోలింగ్ వాహనం, పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జీఎంఆర్ గ్రూపు వైస్ ప్రెసిడెంట్ రామరాజు, సీడీవో కోటేశ్వరరావు, డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐ ఎస్వీ ప్రభాకర్, ఎస్‌బీ సీఐ ఎ.లీలారావు, ఎస్ఐ వి.పాపారావు పాల్గొన్నారు.ఎస్‌బీ సీఐ ఎ.లీలారావు, ఎస్ఐ వి.పాపారావు పాల్గొన్నారు.

## మహిళా ఎస్ఐ దేవిపై దాడి పట్ల హోంమంత్రి అనిత ఆగ్రహం



విజయనగరం క్రైం/ వేపాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వల్లంపూడి పోలీసుస్టేషన్ మహిళా ఎస్ఐ దేవిపై దాడి ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో హద్దులు మీరి ప్రవర్తించిన దుండ గులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వేపాడ మండలం గుడివాడలో డాన్స్ బేబి డాన్స్ కార్యక్రమంలో నృత్యం చేస్తున్న మహిళలతో మద్యం తాగి అసభ్యంగా ప్రవర్తించడంతో ఎస్ఐ దేవి అడ్డుకుందన్నారు. దీంతో ఎస్ఐపై వారు దురుసుగా ప్రవర్తించారన్నారు. ఈ విషయమై ఎస్పీ వకుల్ జిందాల్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నానన్నారు. ఇప్పటికే తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పీ తనతో చెప్పారన్నారు. జాతర పేరుతో మహిళల పట్ల పోకిరి వేషాలు వేస్తే సహించబోమని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

## టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేయండి

అసెంబ్లీలో మన వాణి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాం (2014-19)లో విజయనగరంలోని సారిపల్లిలో టిడ్కో ఇళ్ల కేటాయింపు జాబితా నుంచి వైసీపీ ప్రభుత్వం కొన్ని పేర్లు తొలగించిందని అసెంబ్లీలో గురువారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రస్తావించారు. దానివల్ల లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గృహ నిర్మాణంపై చేపట్టిన సమీక్షలో ఆమె టిడ్కో ఇళ్లపై మాట్లాడారు. తిరిగి వారి పేర్లను జాబితాలో చేర్చి వారికి ఇళ్లు కేటాయించాలన్నారు. లేని పక్షంలో లబ్ధిదారులు తిరిగి ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. అలాగే టిడ్కో గృహ సముదాయానికి వెళ్లే రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. సోనియానగర్‌లో గృహ సముదాయం వద్ద వాటర్ ట్యాంకు నిర్మించలేదననే విషయాన్ని సభలో ప్రస్తావించారు. ప్రధానంగా సారిపల్లిలోని ఎన్టీఆర్‌నగర్, కొండ వెలగాడ రోడ్డులోని సోనియానగర్‌లోని టిడ్కో గృహ సముదాయాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించి, సంబంధిత లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.

# హోలీ.. రంగుల కేళి

● అప్రమత్తతే శ్రీరామరక్ష
● రసాయనాలతో ప్రమాదం
● ప్రకృతి సిద్ధ రంగులే శ్రేయస్కరం

విజయనగరం/ రింగురోడ్డు/ పార్వతీపురం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ అంటే ఆ ఆనందమే వేరు. ఆబాలగోపాలం రంగులు చల్లుకుంటారు. అయితే రంగుల్లో రసాయన మిశ్రమాలు ఉండడంతో ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశాలే అధికం. అందుకే సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో మెర్క్యూరీ సల్ఫైడ్, అల్యూమినియం బ్రోమైడ్, లెడ్ ఆక్సైడ్, కాపర్ సల్ఫైడ్ వంటి రసాయనాలను కలుపుతుంటారు. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో హానికరం. అవి కంట్లో పడితే చూపు కోల్పోయే ప్రమాదం ఉంది.

### సహజ సిద్ధమైన రంగులు శ్రేయస్కరం

హోలీలో సహజ సిద్ధమైన రంగులు వాడడం చాలా ముఖ్యం. ప్రకృతి ప్రసాదించిన పువ్వులు, ఆకులతో తయారయ్యే రంగులను వినియోగిం చడం ఉత్తమం. ముఖ్యంగా మోదుగ, గోగుపువ్వులను నీటిలో మరిగిస్తే కాషాయం రంగు వస్తుంది. బీట్‌రూట్, పసుపు, గోరింటాకు, మందార, గులాబీ, మొక్కజొన్న పిండి, నారింజ తొక్కలతో సహజసిద్ధంగా రంగులు తయారు చేసుకోవచ్చు. ఇటువంటి రంగులను చల్లుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలని నిపుణులు సూచిస్తున్నారు.

### జాగ్రత్త సుమా

హోలీ రోజు మత్తు పదార్థాలు తీసుకోవడం అవాంఛనీయ ఘటనలకు దారి తీయవచ్చు. తలపై, ఇతర ప్రదేశాల్లో కోడిగుడ్లతో కొట్టడం, బురద నీరు చల్లడం వంటివి చేయకూడదు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు వీలైనంత వరకూ రంగుల వేడుకలకు దూరం గా ఉండడం మంచిది. రంగులు పూసుకోవడం, వారిపై చల్లడం ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది.



### ఇలా చేస్తే మేలు

హోలీ ఆడడానికి ముందే గోళ్లకు దట్టంగా నెయిల్ పాలిష్ వేయాలి. దీనివల్ల గోళ్లలోకి రంగుల ప్రభావం పోకుండా ఉంటుంది. కొబ్బరి నూనె, ఆముదం, ఆలివ్ ఆయిల్ చెంచా చొప్పున తీసుకొని అందులో గోళ్లను ముంచి కాసేపు ఉంచాలి. హోలీ రంగులతో ఎక్కువగా నష్టం జరిగేది జుత్తుకు. ముందు రోజు రాత్రే నూనె పట్టించి మర్దన చేసుకోవాలి. మహిళలు ఉదయం గట్టిగా జడ వేసుకుంటే రంగుపడినా జుత్తుకు ఏమీ కాదు. హోలీ ముందురోజు శరీరమంతా ఆముదం రాసుకోవాలి. దాని వల్ల రంగుల ప్రభావం చర్మం లోపలికి వెళ్లదు. రంగులు తొందరగా తొలగిపోతాయి కూడా. హోలీ తరువాత ముల్తాన్ మట్టి ప్యాక్‌ను తీసుకొని రాయడం వల్ల రంగులు తొలగిపోతాయి.

### నయనం ప్రధానం

కళ్లను అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలి. రసాయన రంగులు పడి కళ్లకు ఇబ్బందులు రావచ్చు. అందుకే హోలీ ఆడుతున్న సమయంలో తరచూ ముఖం కడుగుకోవాలి. రోజ్ వాటర్‌తో కడుగుకుంటే కళ్లకు మంచి జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. కళ్ల చుట్టూ ఉన్న చర్మం చాలా తేలిగ్గా ఉంటుంది. వీటిపై రంగులు పడితే కమిలిపోతాయి. అందుకే హోలీ ఆడే ముందు కళ్ల చుట్టూ కొబ్బరి, బాదం నూనె రాసుకోవడం మంచిది. కళ్లు ఎర్రబడడం, నీరుకారడం, పుసులు కట్టడం, దురద, రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. తక్షణం వైద్యనిపుణులను సంప్రదించడం శ్రేయస్కరం.

### హానికర రంగులతో చర్మ సమస్యలు



హోలీ రంగుల్లో డీజిల్, ఇంజిన్ ఆయిల్, గ్లాస్ పౌడర్, యాసిడ్, ఆల్కలీ, అల్యూమినియం బ్రోమైడ్, కాపర్ సల్ఫేట్, కాల్షియం, క్రోమియం, లెడ్ ఆక్సైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను వినియోగిస్తున్నారు. ఇటువంటి రసాయన రంగులు శరీరంపై పూసుకోవటం వల్ల చర్మ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చర్మం ఎర్రగా మారటం, మంట, రాషెస్, ఎర్రటి దద్దుర్లు వచ్చే అవకాశం ఉంది. ఈ రసాయన రంగులు నీటితో కలిసి భూమిలో ఇంకిపోతే పర్యవరణం దెబ్బతింటుంది. చర్మం ఎర్రగా మారితే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

- డాక్టర్ చండీ ప్రియ, చర్మవ్యాధి నిపుణులు

### కంటికి ప్రమాదం..



హోలీ పండగ సందర్భంగా విపరీతంగా వినియోగిస్తున్న రసాయనాలు కలిసిన రంగులతో ప్రమాదం ఉంది. కళ్లల్లోకి రసాయనాలు కలిసిన రంగుపడితే ముందుగా పరిశుభ్రమైన నీటితో కడగాలి. అనంతరం కంటి వైద్యులను సంప్రదించాలి. హానికర రసాయనాలు కలిపిన రంగుల వినియోగం వల్ల కంటిచూపు పోయే అవకాశం ఉంది. కళ్లు ఎర్రగా మారినా, కళ్ల నుంచి నీరు కారినా వైద్యులను సంప్రదించాలి.

- మంచు కుమార స్వామి, కంటి వైద్య నిపుణులు

## పోలిపల్లి పైడితల్లి హుండీ ఆదాయం రూ.26.60 లక్షలు

రాజాం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి వివిధ మార్గాల ద్వారా రూ.26,60,714 ఆదాయం సమకూరిందని దేవస్థానం ఈవో మాధవరావు ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది కన్నా రూ.4 లక్షలు అదనంగా ఆదాయం సమకూరిందన్నారు. ఈ ఏడాది జాతర సందర్భంగా ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.3,88,850, మొక్కుబడుల ద్వారా రూ.2,66,700, శీఘ్ర దర్శనం ద్వారా రూ.3,05,000, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.2,21,760, పులిహోర ప్రసాదం ద్వారా రూ.1,31,900, హుండీల ద్వారా రూ.12,85,646, విరాళాల ద్వారా రూ.60,858 ఆదాయం సమకూరిందని ఈవో వివరించారు.

## రూ.1.23 కోట్ల పన్ను వసూలు

నెల్లిమర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీలో ఈనెల 13 నాటికి రూ.1.23 కోట్లు పన్ను వసూలు చేసినట్టు కమిషనర్ కె.అప్పలరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగర పంచాయతీ పరిధిలో ప్రైవేటు ప్రాపర్టీలకు సంబంధించి ఆస్తి పన్ను రూ.1.48 కోట్లు డిమాండ్ కాగా ఇంకా రూ.25 లక్షలు బకాయి ఉందన్నారు. ఈ నెలాఖరిలోగా పన్ను బకాయిలను చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

## ఖాళీ స్థలాలకు పన్ను చెల్లింపు

విజయనగరం రింగురోడ్డు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ డెవలపింగ్ సంస్థ ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఖాళీ స్థలాలకు సంబంధించి పన్ను రూ.32.85 లక్షలు చెల్లించింది. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును కమిషనర్ నల్లనయ్యకు ఆ సంస్థ ప్రతినిధి చెక్కు రూపంలో గురువారం అందజేశారు.

## రేపు జాబ్ మేళా

విజయనగరం రింగురోడ్డు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహారాజా డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రసన్నకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు నైపుణ్యం.ఏపీ జీవోవీ. ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు నమోదు చేసుకోవాలన్నారు. సంబంధిత అడ్మిట్ కార్డుతో పాటుగా ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు, పాస్‌పోర్టుసైజు ఫొటోలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 8099461303, 9988853335 సంప్రదించాలని కోరారు.

## భవిష్యత్తులో డ్రోన్లే కీలకం

నెల్లిమర్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో డ్రోన్లు కీలకపాత్ర పోషించనున్నాయని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో డీన్ ప్రొఫెసర్ జె.అనిల్‌కుమార్ అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, సెంచూరియన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న వింగ్స్ ఆఫ్ ఇన్నోవేషన్ ఎంపవరింగ్ స్కిల్స్ త్రూ డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాప్ ముగింపు సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, డాక్టర్ బొంతు కోటయ్య, డాక్టర్ కె.లత, డాక్టర్ ప్రేమ చటర్జీ, డాక్టర్ ఎన్‌వీఎస్ సూర్యనారాయణ, డాక్టర్ ఎం.జి.నాయుడు, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఉనికి కోసమే వైసీపీ ఉద్యమాలు



మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఉనికి కోల్పోకుండా ఉండటం కోసమే వైసీపీ నాయకులు ధర్నాలు చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేయడంతో పాటు డిగ్రీ విద్యార్థులకు బకాయిలు పెట్టిన ఘనత వారిదేనన్నారు. వారే మళ్లీ రోడ్డెక్కడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పటి బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లిస్తున్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఐదేళ్లు ప్రచార ఆర్భాటం తప్ప ఆ పార్టీ చేసేందేమీ లేదన్నారు. పార్టీని ప్రజలు మరిచిపోతారన్న భయంతోనే వైసీపీ నాయకులు ఏదో సాకు చూపించి రోడ్డెక్కుతున్నారని నాగార్జున విమర్శించారు.

## మే నెలాఖరుకు చీపురుపల్లి ఆర్వోబీ పూర్తి

● బీజేపీ నాయకుడికి రైల్వే అధికారుల లేఖ



లేఖను చూపిస్తున్న శ్రీనివాసరావు

చీపురుపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఆర్వోబీ పూర్తి స్థాయిలో 2025 మే నెలాఖరుకు అందుబాటులోకి రానున్నదని బీజేపీ జిల్లా కో-కన్వీనర్ మన్నెపురి శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు రైల్వే అధికారులు తనకు లేఖ రాసినట్టు వెల్లడించారు. లేఖను ఆయన గురువారం చీపురుపల్లిలో విలేకరులకు చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి చీపురుపల్లి ఆర్వోబీ సమస్యను వివరించానన్నారు. ఆయన స్పందించి, తక్షణమే విశాఖపట్నం రైల్వే డీఆర్ఎంతో మాట్లాడారన్నారు. దీనికి స్పందించిన రైల్వే అధికారులు తనకు లేఖ రాశారన్నారు.

## విద్యతోనే జీవితాల్లో వెలుగు: డీఎస్పీ

మెంటాడ మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి అన్నారు. వాటివల్ల సామాజిక అశాంతి ఏర్పడుతుందన్నారు. గురువారం పనుకువానివలసలో ఆమె పర్యటించారు. విద్య జీవితంలో వెలుగులు నింపుతుందన్నారు. జనవిజ్ఞాన వేదిక కృషిని డీఎస్పీ అభినందిచారు. కార్యక్రమంలో గజపతినగరం సీఐ వెంకటరమణ, ఆంధ్ర ఎస్ఐ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## మామిడిపల్లిలో ఆధ్యాత్మిక శోభ



ముర్రాటలతో మహిళల ఊరేగింపు

సంతకవిటి, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మామిడిపల్లిలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో నిర్మించిన కనక దుర్గాదేవి ఆలయ ప్రారంభోత్సవాలు గురువారం మొదలయ్యాయి. తొలిరోజు మహిళలు అమ్మవారికి ముర్రాటలు సమర్పిం చారు. ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని నిర్వహించనున్నారు.

## ముత్యాలమ్మకు వెండి కిరీటం, బంగారు నేత్రాలు



పూజల్లో ధర్మవరపు కుటుంబ సభ్యులు

వేపాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురం గ్రామ దేవత ముత్యాలమ్మతల్లికి అదే గ్రామానికి చెందిన ధర్మవరపు కుటుంబ సభ్యులు వెండి కిరీటం, బంగారు నేత్రాలను గురువారం సమర్పించారు. ధర్మవరపు వరహాలమ్మ కుమారులు సత్తిబాబు, సన్యాసిరావు ఆలయ ప్రతినిధులకు అందజేసి అమ్మవారిపై భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో అవతారం, ప్రసాద్, అంజి, బుచ్చమ్మ, జాగరపు దేముడు, గొర్రిపోటు రోహన్‌కుమార్, శివ, పైడిరాజు తదితరులున్నారు.

అలాగే మండలంలోని సోంపురం, అరిగిపాలెం జంట గ్రామాల ప్రజల ఆరధ్య దేవత ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు తీర్థాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండ్ల వేషాలు, మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మధ్యాహ్నం సంగిడీ రాళ్లు ఎత్తే పోటీ నిర్వహించారు. రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించారు.

● డెంకాడ: డెంకాడలో బంగారమ్మతల్లి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. ఎడ్లబండ్ల పరుగు పందేలు పోటీలు నిర్వహించి విజేతకు రూ.20 వేలు నగదు అందజేశారు. డెంకాడ గ్రామ పెద్దలు పాణిరాజు, ప్రదీప్‌రాజు, రొంగలి కనకసింహాచలం, పొంద్రంకి ఆదినారాయణ, పతివాడ అప్పలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● కొత్తవలస, మార్చి 13 (ఆంధ్రజ్యోతి : మండలంలోని దేవాడలో గురువారం ముత్యాలమ్మకు తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

నెల్లిమర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ పరిధిలో తూర్పు మహారాజుపేట (కొండపేట) గ్రామంలో పూడమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు ఆల్తి శ్రీనివాసరావు, నడిపిన నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారి పూజల అనంతరం అన్నసమారాదన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లెంక అప్పలనాయుడు, తెలుగు యువత నాయకులు బైరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న గుర్రపు పందేల పోటీ



వెంకటరమణపేటలో గుర్రపు పందేల పోటీ

శృంగవరపుకోట రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగైరమ్మపేట, వెంకటరమణపేటల్లో ఎల్లారమ్మతల్లి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరమణపేటలో నిర్వహించిన గుర్రపు పందేల పోటీ ఆకట్టుకుంది.

## విద్యార్థులా.. పనోళ్లా..?

● విద్యార్థులతో టెన్త్ పరీక్ష కేంద్రానికి బల్లల తరలింపు ● ఉపాధ్యాయుల నిర్వాకంపై పలువురు ఆక్షేపణ

మెరకముడిదాం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల నేపథ్యంలో మెరకముడిదాంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నుంచి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు గురువారం ఓ ట్రాక్టర్‌పై బల్లలు తరలించడం చర్చనీయాంశమైంది. విద్యార్థులతో ఉపాధ్యాయులు పనిచేయిస్తుండటాన్ని పలువురు ఆక్షేపించారు. విద్యార్థులను పనోళ్లను చేయడంపై మండిపడ్డారు. ఈవిషయంపై సంబంధిత హెచ్ఎం కోట్ల ఎల్లంనాయుడు వివరణ కోరగా విద్యార్థులు బల్లలు తీసుకెళితే పెద్ద తప్పేంకాదని నిర్లక్ష్యంగా బదులిచ్చారు. ఇదే విషయంపై ఎంఈవో చంద్రశేఖర్ వివరణ కోరగా విద్యార్థులతో పనిచేయించడం తప్పు అని, విచారణ నిర్వహించి చర్యలు చేపడతామని తెలిపారు.



ట్రాక్టర్‌పై బల్లలు తీసుకెళ్తున్న విద్యార్థులు

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

సీతానగరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరిపివలస సమీపంలో గురువారం ద్విచక్రవాహనం, కారు ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పార్వతీపురం పట్టణంలోని అగ్రహారం వీధికి చెందిన పి.సత్యస్వరూప్ భార్య జ్యోతితో కలిసి విశాఖపట్నంలో చదువుతున్న తమ పిల్లల వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. మరిపివలస సమీపంలో బొబ్బిలి నుంచి వస్తున్న కారు వీరిని ఢీకొంది. దీంతో గాయపడిన వీరిని పార్వతీపురంలోని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలించారు. ఈ మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 20 లీటర్ల సారా స్వాధీనం

సీతంపేట రూరల్,మార్చి 13(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిన్నగోర సమీపంలో 20లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, తరలిస్తున్న కె .అప్పలస్వామిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు దోనుబాయి ఎస్ఐ మస్తాన్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## వైద్యసేవలో అక్రమాలపై లోతుగా ఆరా

● నివేదిక తర్వాత చర్యలు: ఈవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెంటాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవలో అక్రమాలు వెలుగు చూసిన తర్వాత మరింత లోతైన విశ్లేషణతో గురువారం 'ష్..గప్‌చుప్' శీర్షికన ప్రచురితమైన కథనం వైద్య ఆరోగ్య శాఖలో మరోసారి ప్రకంపనలు సృష్టించింది. ఇంత పకడ్బందీ సమాచారం ఎలా వెళ్తోందనేది అధికార వర్గాల్లో చర్చనీయాం శంగా మారింది. కొంతమంది ఉద్యోగులకు ఫోన్ చేసిమరీ ఆరాతీసినట్టు విశ్వసనీయంగా తెలియవచ్చింది. కాగా పాలకొండలో సతీమణి ఎండీగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహిస్తున్నట్టు ఆంధ్రజ్యోతికి సమాచారం ఎవరిద్వారా వెళ్లిందని ఆ కీలక అధికారి పలువురి వద్ద ఆరా తీశారని సమాచారం. ఇది వైద్యసేవ ఉద్యోగుల పనేనని ఆయన పలువురి వద్ద చిర్రుబుర్రులాడినట్టు తెలిసింది. వారి వివరాల కోసం అన్ని మార్గాల్లో ప్రయత్నిస్తున్నారట.

### నివేదిక తర్వాత చర్యలు: ఎన్టీఆర్ వైద్యసేవ ఈవో

జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలో అవినీతి అక్రమాల వ్యవహారంపై రాష్ట్ర ఈఓ ఓబుల్ నాయుడు స్పందించారు. గురువారం ఆయన ఫోన్లో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఈ వ్యవహారం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. వైద్యసేవ కోఆర్డినేటర్‌ను విచారణకు ఆదేశిస్తానని చెప్పారు. వేరే అధికారితో విచారణ జరిపించి నివేదిక అనంతరం తగిన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భోగాపురం, మార్చి13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సవరవల్లి, ఉప్పాడపేట, రావాడ, బసవపాలెం, తూడెం, కవులవాడ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేసామని ఏఈ మస్తాన్‌వలీ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.